క్లుప్తంగా

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మాదిగ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు మాదిగ పేద విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనరాజు తెలిపారు. తిరువూరు, విస్సన్నపేట, చాట్రాయి, రెడ్డిగూడెం మండలాల్లోని విద్యార్థులు ఈ నెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీబీఎస్, బీఈడీ, ఎంఈడీ, డీఎడ్ చదువుతున్న విద్యార్థులకు కూడా తమ సంఘం ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేస్తోందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 98856 41456, 94403 52445 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

కొండపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ట్రాఫిక్ నియంత్రణకు సీఐ చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. కొండపల్లి బ్యాంక్ సెంటర్‌లో ఎస్ఐ లక్ష్మణరావు ఆటో డ్రైవర్లు, దుకాణదారులు, ద్విచక్ర వాహన దారులు, చిరు వ్యాపారులకు రోడ్లు, దుకాణాల ముందు వాహనాలు నిలపకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తూ రోడ్లపై పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్ వారికి సహకరించాలని ఎస్ఐ కోరారు.

ఎస్‌బీఐ నూతన పథకం ప్రారంభం

తిరువూరు: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖలో ఆదివారం ప్రతి ఇంట్లో లక్షాధికారి పథకం ప్రారంభించారు. బ్యాంకు యాజమాన్యం ఆదేశాల మేరకు కొత్త రికరింగ్ డిపాజిట్ మేళాలో ఈ పథకం గురించి మేనేజరు రవికుమార్ వివరించారు. ప్రజల్లో పొదుపుపై అవగాహన కల్పించి భవిష్యత్ అవసరాల కోసం ఈ పొదుపు పథకాన్ని అమలులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఇబ్రహీంపట్నం: అదుపు తప్పిన కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన ఘటన 30వ నంబర్ జాతీయ రహదారిపై స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. గంపలగూడెంకు చెందిన స్మామ్రాట్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవ దర్శనం కోసం కారులో తిరుపతి పయనమయ్యారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి ఓ స్కూటీ, బైక్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో జగ్గయ్యపేటకు చెందిన నారాయణ, నూజివీడుకు చెందిన సుజాతకు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నూజివీడు: సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేశామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు–కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు రద్దు చేశారని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఈ కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తామన్నారు. డివిజన్‌లోని ప్రజలు గమనించాలని కోరారు.

ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేశామని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కృష్ణా–గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దయిందని వివరించారు.

వృద్ధులకు అల్పాహారం

కాచవరం(ఇబ్రహీంపట్నం): నిరాదరణకు గురవుతున్న వృద్ధులను మానవతా దృక్పథంతో ఆదరించాలని కాచవరం అమ్మా నాన్న వృద్ధాశ్రమం నిర్వాహకులు చలసాని వెంకటేశ్వరరావు అన్నారు. వెలమ రామారావు, ఆయన సతీమణి కృష్ణకుమారి ఆదివారం వృద్ధులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జన్మదినోత్సవాలు, వివాహ మహోత్సవాలు ఇతర మంచి కార్యక్రమాలకు డబ్బులు వృథా చేయకుండా వృద్ధుల కోసం వెచ్చించి ఆదుకోవాలని కోరారు. సంస్థ సూపర్ వైజర్ రాంబాబు, సత్యనారాయణ, కౌముదిరావు తదితరులు పాల్గొన్నారు.

మార్జిన్ల కన్నా.. నేమ్ బోర్డులే ముఖ్యమా?

- సీసీ రోడ్లకు బెరమ్స్ వేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్లు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- హడావిడిగా నేమ్ బోర్డుల నిర్మాణం



చెవుటూరు గ్రామంలో బెరమ్స్ వేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు



జి.కొండూరులో నూతనంగా నిర్మించి సీసీ రోడ్డు బెరమ్స్ వేయకుండా నిర్మించిన నేమ్ బోర్డు

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లను నిర్మించి నెల దాటినా మార్జిన్లకు బెరమ్స్ వేయకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కేవలం మూడు మీటర్ల మాత్రమే సీసీ రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చినప్పుడు పక్కకి తప్పుకోబోయిన వాహనదారులు పక్కనే ఉన్న కాల్వల్లో పడిపోతున్నారు. రాత్రి సమయాల్లో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్జిన్లకు బెరమ్స్ వేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్లు, అధికారులు నేమ్ బోర్డుల నిర్మాణానికి మాత్రం నిధులు ఖర్చు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిధులు రాలేదంటూ..

మైలవరం నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులు రూ.22.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మైలవరం నియోజకవర్గంలో పలు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయి నెల రోజులు దాటింది. పూర్తయిన సీసీ రోడ్లకు బెరమ్స్ వేయకుండా వదిలేశారు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేసిన కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకపోవడం వల్లనే బెరమ్స్ వేయలేదని తెలుస్తోంది. అధికారులు వెంటనే స్పందించి సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిన చోట బెరమ్స్ వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మైలవరం నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల వివరాలు			
మండలం	గ్రామ పంచాయతీలు	రోడ్లు	నిధులు
మైలవరం	13	50	రూ.5 కోట్లు
జి.కొండూరు	22	41	రూ.5 కోట్లు
రెడ్డిగూడెం	12	48	రూ.5 కోట్లు
ఇబ్రహీంపట్నం	10	57	రూ.5 కోట్లు
విజయవాడ రూరల్	05	13	రూ.2.50 కోట్లు

నాణ్యత లోపించిందని ఆరోపణలు

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్ల నిర్మాణంలో వినియోగించే ఇసుకను బుడమేరు నుంచి తరలించిన ఘటనలు గతంలో వెలుగులోకి వచ్చాయి. ఈ ఇసుకలో మట్టి, రాళ్లు అధికంగా ఉండడం వల్ల రోడ్లు త్వరితగతిన ధ్వంసమైపోతాయనే ఆరోపణలు వచ్చాయి. డస్టు, కంకర, సిమెంట్ సైతం తక్కువ క్వాలిటీవి వినియోగించారనే వాదన ఉంది. కాంట్రాక్టర్లు అందరూ అధికార పార్టీ నాయకులే కావడంతో అధికారులు సైతం ఏమీ చేయలేక చేతులెత్తేశారనే విమర్శలు వస్తున్నాయి.



జి.కొండూరు చెరువు కాలనీలో బెరమ్స్ వేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నాయి



సీసీ రోడ్లు వేసి బెరమ్స్ వేయకుండా వదిలి వేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి వెడల్పు లేకపోవడంతో పాటు మార్జిన్ల పక్కన కాల్వలు లోతట్టుగా ఉండడం వల్ల ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకునే పరిస్థితిలేక ఇబ్బందులు పడుతున్నారు. మార్జిన్లకు వెంటనే బెరమ్స్ వేయాలి.

– బుర్రి ప్రతాప్, తోలుకోడు గ్రామం

ఎదురెదురుగా వాహనం వస్తే వెనక్కి వెళ్లాల్సిందే



కొత్తగా వేసిన రోడ్లపై ఎదురెదురుగా వాహనం వస్తే వెనక్కి వెళ్లాల్సిందే. మార్జిన్లకు బెరమ్స్ వేయకుండా వదిలేయడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే బెరమ్స్ వేయాలి. బెరమ్స్ వేయకుండా నేమ్ బోర్డులను నిర్మించడం దారుణం.

– గూడూరు బలరామిరెడ్డి, చెవుటూరు గ్రామం

బెరమ్స్ వేయిస్తాం

సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలను పాటిస్తున్నాం. పూర్తయిన సీసీ రోడ్లకు బెరమ్స్ వేయిస్తాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో చేసిన పనుల వివరాలతో కూడిన నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలి.

– సాంబశివరావు, పంచాయతీరాజ్ ఏఈ, జి.కొండూరు

సేవాలాల్ క్యాలెండర్ ఆవిష్కరణ



చాట్రాయి: లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా మండలంలోని పోతనపల్లి తండాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం, బంజారా భజరంగ భేరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సేవాలాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయాలని, 500 మంది జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా గుర్తించాలని లంబాడీ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం నాయకులు డి. నాగేశ్వరరావు, డి. బాలరాజు, రాంబాబు, బి. భాస్కరరావు, బి. పాంచాలు, మల్లికార్జునరావు, డి. మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి



పోలీసులకు పట్టుబడిన జూదరులు

ఆగిరిపల్లి: చిన్న ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,300 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక



ఆనాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాజీ సర్పంచ్ సగ్గుర్తి రమేష్, మడుపల్లి చంద్రమోహన్, బడుగు బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆపదలో ఉన్న సహచర మిత్రులకు తగిన సహాయం చేస్తూగ్రామంలో జరిగే రథసప్తమి తిరునాళ్లకి ప్రసాదం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని పుష్పలత కోరిక మేరకు విద్యార్థుల సైకిల్ షెడ్‌లో ఫ్లోరింగ్ నిర్మాణం చేస్తామన్నారు. వడ్లమాను ఎంపీటీసీ రాణిమేకల సత్యనారాయణ, సీహెచ్ సురేష్ కుమార్, వైవీ నరసింహారావు, విపుల సీతారామస్వామి, బ్రహ్మచారి, నిరీక్షణరావు పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత

ముసునూరు: జీవ వైవిధ్యం, పర్యావరణాన్ని కాపాడే చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్ఓ బి.విజయ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణా దినోత్సవం సందర్భంగా ఆదివారం చెక్కపల్లి హైస్కూల్ ఎకో క్లబ్ విద్యార్థులు కొల్లేరు సరస్సు వద్ద గల ఆటపాక పక్షి సంరక్షణా కేంద్రాన్ని సందర్శించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ మొక్కలకు, సకల జీవరాశుల ఆవిర్భావానికి ఆవాసంగా, పర్యావరణ పరిరక్షణకు చిత్తడి నేలలు తోడ్పడుతున్నాయన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో మాన్‌గ్రూవ్ మొక్కలు, పక్షుల పెరుగుదలకు చిత్తడి నేలలే ఆధారమని చెప్పారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి రంజిత్‌కుమార్ విద్యార్థులకు పక్షి సంరక్షణా కేంద్ర మ్యూజియంలోని పక్షుల జీవన విధానం, వాటి అరుపులు తదితర విషయాలను వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన పెలికాన్, ఫ్లెమింగో, గూడబాతులు తదితర పక్షులను చిన్నారులు తిలకించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, హెచ్ఎం అబ్బాస్, ఉపాధ్యాయులు పద్మకిశోర్, పద్మలత, యోగిత, వింధ్య, కిరణ్మయి, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్ర చదవాలి



తిరువూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న పద్మావతి

తిరువూరు: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాధికారి కె. పద్మావతి అన్నారు. రచయిత రాంప్రదీప్ రాసిన 'విస్మృత మహనీయులు' పుస్తక పరిచయ కార్యక్రమం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. భారతదేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన ఎందరో మహనీయులు చరిత్రలో వెలుగు చూడలేదని, వారి గురించి రాంప్రదీప్ ప్రత్యేకంగా పుస్తకం రాయడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులకు దేశ చరిత్ర, సంస్కృతి, మహనీయుల జీవిత విశేషాలపై అవగాహన కల్పిస్తూ రాసిన ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పుస్తక రచయిత రాంప్రదీప్, పాఠకులు పాల్గొన్నారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ముసునూరులో తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వీరంకి నాగరాజును అదుపులోకి తీసుకుని, తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

జి.కొండూరు: జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.31,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



నేడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

నూజివీడు: నూజివీడు పురపాలక సంఘం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ నిమిత్తం సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తామని కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారిగా సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌ను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కమిషనర్ కోరారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



మునుకుళ్ల (తిరువూరురూరల్): మునుకుళ్లలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం, పల్లకీ సేవ, ప్రాబోధిక ఆరగింపు, తీర్థపు బిందె, ప్రాతఃకాల అర్చన, స్వామి వారికి సహస్ర నామార్చన తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

7న చలో హైదరాబాద్

మైలవరం: మంద కృష్ణ మాదిగ ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా యువసేన అధ్యక్షుడు ఇంకొల్లు జమలయ్య మాదిగ ఒక ప్రకటనలో కోరారు. మైలవరం నియోజకవర్గం నుంచి విశేష సంఖ్యలో మాదిగలు కదలి వచ్చి ఆయనకు చేదోడు వాదోడుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాదిగలు వేల సంఖ్యలో కదలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు పోరు పోస్టర్ల ఆవిష్కరణ



ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తిరుపతిరావు, రవిచంద్ర తదితరులు

జి.కొండూరు: విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అటకెక్కించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు అన్నారు. ఈ నెల 5వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఫీజు పోరు పోస్టర్లను విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రతో కలిసి తిరుపతిరావు జి.కొండూరులో ఆదివారం ఆవిష్కరించారు. రవిచంద్ర మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ చేపట్టనున్న ఫీజుపోరు కార్యక్రమానికి విద్యార్థులు తరలివచ్చి సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించారు.. అప్రోచ్ మరిచారు

రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు



తిరువూరు సుందరయ్య కాలనీలో సీసీ రోడ్డు ఇలా..

తిరువూరు: పట్టణంలోని పలు కాలనీలలో నగర పంచాయతీ నిర్మించిన అంతర్గత రహదారులు రాకపోకలకు వీలులేని విధంగా ఉన్నాయి. సీసీ రహదారుల నిర్మాణంలో నిర్దిష్ట ప్రమాణాలు పాటించకపోవడంతో కాలనీ వాసులు, ద్విచక్ర వాహనం జారిపడి గాయాల పాలవుతున్నారు. సుందరయ్య కాలనీ, తంగిళ్లబీడులలో ఆరు సీసీ రహదారులకు జాయింట్లు కలపకపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై తిరువూరు నగర పంచాయతీ అసిస్టెంట్ ఇంజినీరు హనుమంతరావును వివరణ కోరగా గతంలో వేసిన ఎస్టిమేట్లలో రహదారుల నిర్మాణానికే నిధులు కేటాయించారని, జాయింట్లు బెర్మ్‌తో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

220 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ తిరువూరు శాఖ కన్వీనర్ దామెర ప్రభాకరరావు పర్యవేక్షణలో వైద్యులు 220 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. సాధారణ జబ్బులు, దంత సంబంధిత వ్యాధులు, రక్తపోటు, మధుమేహం తదితర రోగులకు ఆరోగ్యకర జీవన విధానాన్ని వివరించారు. ఈ నెల 9న పెనుగొలనులో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని సత్యసాయి సేవా సంస్థ సభ్యుడు హనుమంతరావు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న తులసీప్రభు

విస్సన్నపేట: కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఎయిడ్ ఫర్ పూర్ చారిటబుల్ ట్రస్టు (కోపా) ఆధ్వర్యంలో ఆదివారం విస్సన్నపేట వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. తులసీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు ముఖ్య అతిథిగా విచ్చేసి 270 మంది విద్యార్థులకు రూ.8.80 లక్షల నగదును పంపిణీ చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు కోపా ప్రోత్సాహాన్నందిస్తోందని ఆయన చెప్పారు. కోపా ట్రస్ట్ చైర్మన్ బండి గోపాలరావు, డైరెక్టర్ సుజాతరావు, కార్యదర్శి బండి వెంకట కృష్ణారావు, తుంగల నరేంద్రబాబు పాల్గొన్నారు.